సాక్షి నంద్యాల

ఆదివారం | 12 | ఫిబ్రవరి | 2023



గూబగుండంకు పార్వేట పల్లకీ

ఆళ్లగడ్డ: గూబగుండం గ్రామానికి శనివారం అహోబిలేశుడి పార్వేట పల్లకీ చేరుకుంది. గ్రామస్తులు శ్రీప్రహ్లాదవరదస్వామి, శ్రీజ్వాలనారసింహస్వామికి ఘనస్వాగతం పలికారు.



ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష

ఎమ్మిగనూరు: నవోదయ విద్యాలయంలో 9వ తరగతి ప్రవేశం కోసం శనివారం పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 1,172 మందికి గాను 692 మంది హాజరయ్యారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,612.58
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:42.919
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,270

న్యూస్‌రీల్

భారీ వాహనాల దారి మళ్లింపు

బొమ్మలసత్రం: కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లే భారీ వాహనాలు శ్రీశైలం మార్గంలో కాకుండా నంద్యాల నుంచి వెళ్లేలా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీశైలం మార్గంలో విజయవాడకు వెళ్లే భారీ వాహనాలను నియంత్రిస్తున్నామన్నారు. భారీ వాహనదారులు కర్నూలు చెక్ పోస్టు నుంచి నంద్యాల, గిద్దలూరు మీదుగా విజయవాడకు చేరుకోవాలని సూచించారు.

మార్చి 1 వరకు పలు రైళ్లు రద్దు

నంద్యాల(రూరల్): నేటి(ఆదివారం) నుంచి మార్చి 1 వ తేదీ వరకు నంద్యాల మీదుగా వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అదనపు ట్రాఫిక్ మేనేజర్ సురేష్ రెడ్డి శనివారం తెలిపారు. గుంటూరు–గుంతకల్ రైల్వే డబ్లింగ్ నిర్మాణంలో భాగంగా మునుమాక–సావాల్యాపురం రైల్వే స్టేషన్ల మధ్య పనులు జరుగుతుండటంతో మార్చి 1 వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నమన్నారు. ఇందులో నంద్యాల మీదుగా వెళ్లే గుంటూరు–డోన్(17228), గుంటూరు–కాచిగూడ(17251) ఎక్స్‌ప్రెస్ రైళ్లు నేటి నుంచి 28 వరకు, డోన్–గుంటూరు(17228), కాచిగూడ–గుంటూరు(17252) రైళ్లు రేపటి (13వ తేదీ) నుంచి మార్చి 1వ తేదీ వరకు, మచిలీపట్నం–కర్నూలు (07067) రైలు 14వ తేదీ నుంచి 28 వరకు, కర్నూలు–మచిలీపట్నం(07068) రైలు ఈనెల 15వ తేదీ నుంచి మార్చి 1 వరకు రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైల్వే ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

కర్ణాటక భక్తుడికి అస్వస్థత



సొమ్మసిల్లిన భక్తుడిని తీసుకెళ్తున్న అటవీశాఖ సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: కాలినడకన శ్రీశైలానికి వస్తున్న కర్ణాటక భక్తుడు అస్వస్థతకు గురయ్యాడు. శనివారం మధ్యాహ్నం భీమునికొలను వద్ద నడవలేక సొమ్మసిల్లి పడిపోయాడు. తోటి పాదయాత్ర భక్తులు సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని భక్తుడికి మంచినీరు అందించి భీమునికొలను నుంచి కైలాసద్వారం వరకు భుజాల మీద మోసుకుంటూ తీసుకెళ్లారు. అక్కడి నుంచి అటవీశాఖ జీపులో శ్రీశైల దేవస్థాన వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స నిర్వహించడంతో కోలుకున్నాడు.

కాలినడక మార్గంలో ఉచిత వైద్య శిబిరాలు

జూపాడుబంగ్లా: కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం శనివారం నుంచి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు, బొల్లవరం, నందికొట్కూరు, మండ్లెం, జూపాడుబంగ్లా, పాములపాడు తదితర ప్రాంతాల్లో కేజీ రోడ్డు వెంట భక్తులకు అందుబాటులో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. అవసరమైన మందులను వైద్య సిబ్బంది ఉచితంగా అందజేస్తున్నారు.



జూపాడుబంగ్లాలో శివ మాలధారులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది









వడివడిగా శ్రీగిరి వైపు: ఎండను సైతం లెక్క చేయక నడక సాగిస్తున్న శివ భక్తులు

సడలని సంకల్పం..

మేము సైతం..

నమో.. నీలకంఠా!

జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేడుకలను తిలకించేందుకు, మల్లన్న ఆశీస్సులు పొందేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి వెళ్తున్నారు. కొందరు కాలినడకన, మరికొందరు వాహనాల్లో శ్రీగిరి క్షేత్రాన్ని చేరుకుంటున్నారు. నిష్ఠగా 41 రోజుల పాటు దీక్ష నిర్వహించి, ఇరుముడిని సమర్పించేందుకు శివమాలధారులు ముక్కంటి సన్నిధికి వెళ్తున్నారు. పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ సాగుతున్న వీరి పాదయాత్ర భక్తిభావాన్ని నింపుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



దారులన్నీ శ్రీశైలం వైపే..

వాహనంలో శ్రీశైలం వెళ్తున్న భక్తులు

బ్రహ్మోత్సవం.. శాస్త్రోక్తం

శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- స్వామివారి యాగశాలలో ప్రత్యేక పూజలు
- సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ శాస్త్రోక్తంగా ధ్వజారోహణ
- శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ
- నేడు స్వామివార్లకు భృంగివాహనసేవ
- శివదీక్షా భక్తులతో కిక్కిరిస్తున్న శ్రీశైలాలయం





శ్రీశైల దేవస్థానంలో ధ్వజస్తంభంపై రెపరెపలాడుతున్న ధ్వజపటం



భక్తిభావం: జెండాతో వెళ్తున్న వృద్ధుడు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లన్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ దేవస్థాన అధికారులు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సారథ్యం వహించాలని బ్రహ్మదేవుడిని, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవంలో కన్యాదానం చేసేందుకు మహావిష్ణువుకు ఆహ్వానం పలికారు. పరమశివుడి వాహనమైన నందిని చిత్రీకరించిన ధ్వజపతాకాన్ని ఆవిష్కరించారు. 11 రోజుల పాటు కనుల పండువగా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు శనివారం వేదపండితులు, అర్చకులు యాగశాల ప్రవేశం చేసి బ్రహ్మోత్సవ క్రతువుకు నాంది పలికారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఆగమ శాస్త్రానుసారం ఉత్సవ ప్రారంభ పూజలు నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎమ్.విజయలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి, మాధవీలత, అర్చక స్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. వేదపండితులు చతుర్వేద పారాయణం చేయగా.. స్థానాచార్యులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. అనంతరం పుణ్యాహవచనం, చండీశ్వరపూజ జరిపించారు. కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి ధర్మకర్తలమండలి చైర్మన్, కార్యనిర్వహణాధికారి కంకణాన్ని ధరించారు. ఆ తర్వాత బ్రహ్మోత్సవ క్రతువుకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సాయంత్రం 7గంటలకు ధ్వజారోహణ, భేరీపూజ కార్యక్రమాలను నిర్వహించి సకల దేవతలకు ఆహ్వాన సూచికగా ధ్వజపతాకాన్ని ఆవిష్కరించారు.

బ్రహ్మదేవుని సారథ్యంలో..

బ్రహ్మోత్సవాలు సృష్టికర్త బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివపరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో నిర్వహించబడతాయని ప్రతీతి. అందుకే యాగశాల ప్రవేశ అనంతరం చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజాదికాలు చేపట్టారు. శ్రీశైల క్షేత్రం సంప్రదాయాన్ని అనుసరించి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఏడు రోజుల పాటు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య స్వామి తెలిపారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు



భేరీ తాడనం చేస్తున్న ఈఓ, చిత్రంలో చైర్మన్



చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్, ఈఓ

శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ

శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి దేవస్థానం వారిచే శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు దేవస్థాన అర్చకులు, వేదపండితులు పూజలు నిర్వహించి పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని స్వామి అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓ సాగర్‌బాబు, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

నేడు భృంగివాహనసేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లు భృంగివాహనసేవలో భక్తులకు దర్శనమిస్తారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

సకల సౌకర్యాలు

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి లోటు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. బ్రహ్మోత్సవాలకు అధికసంఖ్యలో భక్తులు శ్రీశైలానికి తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తరించాలి.

– రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

శ్రీగిరిలో మొదలైన సందడి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తుల రాక మొదలైంది. 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివస్తున్నారు. దీంతో శనివారం క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి. వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూల ద్వారా ఆలయం వద్దకు చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనం కోసం వేచి ఉన్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలు పూర్తిగా నిండిపోయాయి. సాధారణ భక్తులను మూడు క్యూల ద్వారా అనుమతిస్తున్నారు. శివస్వాములకు చంద్రావతి కల్యాణ మండపం నుంచి ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు.

అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్లు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తెలపవచ్చునని జిల్లా కలెక్టర్ డా.మనజీర్‌జిలానీ శామూన్ భక్తులకు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, వైద్య సదుపాయం, ట్రాఫిక్ తదితర అత్యవసర సమస్యలపై 08524 -287004 , 08524 -287288 , 08524 -287289 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందిస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాదయాత్రలో అవాంతరాలు ఏర్పడినా, బంధుమిత్రులు తప్పిపోయినా పైన సూచించిన నంబర్లకు ఫోన్ చేస్తే అవసరమైన సేవలు అందిస్తామన్నారు. ఇందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో 'ఇరుముడి' సమర్పణ



ఇరుముడి సమర్పిస్తున్న శివదీక్షా భక్తులు

శ్రీశైలంటెంపుల్: శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో శివదీక్షపరులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు సమర్పిస్తున్నారు. పరమేశ్వరుడిపై భక్తితో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది భక్తులు శివదీక్ష స్వీకరించారు. ఉత్సవాలు ప్రారంభం కావడంతో వారంతా తలపై ఇరుముడి పెట్టుకుని పాదయాత్రగా శ్రీశైలానికి తరలివస్తున్నారు. శనివారం దాదాపు నాలుగువేల మంది శ్రీశైలేశుడి సన్నిధికి చేరుకున్నారు. పాతాళగంగ రోడ్డులోని శివదీక్ష శిబిరాల వద్ద ఇరుముడిని స్వామికి సమర్పించారు. కాగా శిబిరాల వద్ద శివ భక్తుల కోసం దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మూగజీవాలకు సేవలు అభినందనీయం

● నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి


గెట్టెలు తీసిన ఆవును చూస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, శివకుమార్‌రెడ్డి

నంద్యాల: మూగజీవాలకు మన ఊరు, మనగుడి–మన బాధ్యత ఆర్గనైజేషన్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో తిరుగుతున్న ఆవుల కాళ్లకు గెట్టెలు తీసే కార్యక్రమం నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే శిల్పా రవి స్వయంగా పరిశీలించి మాట్లాడారు. గోశాల ఏర్పాటుకు మన ఊరు, మన గుడి–బాధ్యత సేవా సంస్థ సభ్యులు ముందుకు వచ్చారని, మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడి అందుకు స్థలం మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, గుంటూరు డిప్యూటీ ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మూగ జీవాలకు తాము పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు నందిపాతి వెంకటేష్, పతంగి హరికృష్ణ, శేఖరప్ప, హేమంత్, శ్రీనివాసులు, శివకుమార్, మోహన్‌రావు, ఆపిల్ ప్రసాద్, రమణ, నరేష్, షన్ముఖరావు, ఉత్తర్క, శీను, తదితరులు పాల్గొన్నారు.

నీతి, నిజాయతీలే గొప్పవాళ్లను చేస్తాయి

● హైకోర్టు జడ్జి ఎం.గంగారావు
● పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ ఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


హైకోర్టు జడ్జి ఎం.గంగారావును సన్మానిస్తున్న క్లాస్‌మేట్స్

తుగ్గలి: నీతి, నిజాయతీలే గొప్పవాళ్లను చేస్తాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎం.గంగారావు అన్నారు. 1975–76 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయికకు శనివారం తుగ్గలి మండలం పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. సమ్మేళన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి జడ్జి గంగారావు పాల్గొన్నారు. పెండేకల్లు భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ గురువులు మంచి విద్యా బుద్ధులు నేర్పడం వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. పెండేకల్లు రైల్వే స్టేషన్ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నానని.. చెట్ల కింద, కొట్టాలలో తరగతులు నిర్వహించేవారన్నారు. ఊరు చుట్టూ ఉన్న కొండ గుట్టలు, వంకలు, వాగులు తిరిగానని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పల్లెటూరి చదువులతో ధైర్యం, నమ్మకం కలుగుతుందని, ఎక్కడైనా బతకవచ్చన్నారు. హాస్టల్‌లో ఉన్నా ఆకలి దప్పులతో ఏనాడూ ఇబ్బంది పడలేదన్నారు. పొలాలకు వెళ్లి శనక్కాయలు, కొండ గుట్టల్లో సీతాఫలాలు తినేవారమని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పెద్దలు, ఉపాధ్యాయులు బావులకు తీసుకెళ్లి ఈత నేర్పారన్నారు. ప్రస్తుత కాలంలో చిన్నప్పటి నుంచి కార్పొరేట్ చదువులతో పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే కొందరు పిల్లలు వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానమంత్రి స్థాయిలో ఉన్నా శాస్త్రి ఏం కొన్నా డబ్బులు చెల్లించేవారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పేవారన్నారు. చిన్నతనంలో తాను చదువుకున్న పాఠశాల అంటే తనకెంతో ఇష్టమని, పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. చదువు చెప్పిన గురువులు సుంకిరెడ్డి, తిప్పన్న, హుసేన్‌లను పూర్వ విద్యార్థులతో కలిసి జడ్జి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, క్లాస్‌మేట్స్ జడ్జిని ఘనంగా సన్మానించారు. అనంతరం గత ప్రభుత్వంలో మూతపడి ఇటీవల పునఃప్రారంభమైన హాస్టల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు .కార్యక్రమంలో పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి దివ్య, ఆర్డీవో మోహన్‌దాస్, తహసీల్దార్ రవి, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధరబాబు, సీఐ రామకృష్ణారెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎం మేఖేల్, సర్పంచ్ హరికరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

20 గ్రామాల్లో వ్యవసాయ బోర్లపై తొలగిన నిషేధం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని 20 గ్రామాల్లో వ్యవసాయ బోర్లపై ఉన్న నిషేధం తొలగిపోయింది. ఈ మేరకు ప్రభుత్వం రాజపత్రం విడుదల చేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గోనెగండ్ల మండలంలోని కులుమాల, గోనెగండ్ల, పెద్దమరివీడు, కోసిగి మండలంలోని కోసిగి, పెండేకల్, ఐరన్‌గల్, నేలకోసిగి, బొంపల్లి, సజ్జలగూడెం, దేవరబెట్ట, యండపల్లి, చిర్తనకల్, ఓర్వకల్లు మండలంలోని కొమరోలు, వెల్దుర్తి మండలంలోని బుక్కాపురం, బేతంచెర్ల మండలంలోని యంబాయి, చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి, చాగలమర్రి, ఆళ్లగడ్డ మండలం అహోబిలం, ప్యాపిలి మండలంలోని మాధవరం, జలదుర్గం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల తవ్వకంపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తి వేసింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఈ గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా మెరుగుపడ్డాయి.

రేపు వాము క్రయవిక్రయాలు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వాము క్రయవిక్రయాలు చేపట్టడం లేదని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఐజ ప్రాంతంలో జరిగే జాతరకు ఒంటెద్దు బండ్ల యజమానులు వెళ్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి యథాతథంగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నీటి గుండంలో పడి యువకుడి మృతి


రామ సుబ్బయ్య (ఫైల్)

బేతంచెర్ల: శ్రీ మద్దిలేటిస్వామి ఆలయ నీటి గుండంలో పడి శనివారం ఓ యువకుడు మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపిన వివరాల మేరకు.. ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఈడిగ సరస్వతమ్మ కొడుకు రామ సుబ్బయ్య మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలోని టెంకాయల అంగడిలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున ఆలయ నీటి గుండం వద్దకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు జారి అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలొదిలాడు. ఉదయం స్నానాలకు వెళ్లిన భక్తులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఈఓ పాండు రంగారెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ఈడిగ రామ సుబ్బయ్య గౌడుగా(27) గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బనగానపల్లె హాస్పిటల్‌కు తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ వెల్లడించారు. ఏకైక కుమారుడు మృతితో తల్లి, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కుమారుడిని కొట్టాడన్న కసితో హత్య

● నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు


హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేవీ మహేష్

కర్నూలు: కుమారుడు కార్తీక్‌ను కర్రతో కొట్టాడన్న కసితో వడ్డె శ్రీరామ్ (41)ను దాదెపోగు శివకృష్ణ హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తు లో తేలింది. ఇందుకు శివకృష్ణ తన స్నేహితులైన బండ అరవింద్ అలియాస్ చాకలి అరవింద్, ఆకెపోగు అనిల్ సహకారం తీసుకున్నారు. నిందితులను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. హత్య కేసు వివరాలను డీఎస్పీ మహేష్ శనివారం విలేకరులకు వివరించారు. సంతోష్ నగర్‌లో నివాసముంటున్న దాదెపోగు శివకృష్ణకు అదే కాలనీలో నివాసముంటున్న వడ్డె శ్రీరామ్ రూ.1,500 బకాయి ఉన్నాడు. ఈ విషయంపై జనవరి 29వ తేదీన ఇరువురూ మద్యం మత్తులో ఘర్షణ పడుతుండగా శివకృష్ణ కుమారుడు కార్తీక్ అడ్డుకోవడంతో శ్రీరామ్ కర్రతో బాదాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని తన స్నేహితులైన బండ అరవింద్ అలియాస్ చాకలి అరవింద్, ఆకెపోగు అనిల్‌తో కలసి శివకృష్ణ పథకం ప్రకారం జనవరి 31వ తేదీ శ్రీరామ్‌ను తన షాపు వద్దకు పిలిపించుకుని స్పృహ కోల్పోయేటట్లు కొట్టారు. అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. శ్రీరామ్ సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు మొదట సెక్షన్ 174 ఐపీసీ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈలోగా నిందితులు ముగ్గురు శుక్రవారం కల్లూరు వీఆర్వో–2 సూర్యబాబు ఎదుట లొంగిపోయి చేసిన నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిని కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ ఎదుట హాజరుపర్చగా సీఐ శంకరయ్యతో కలసి శనివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. మొదట అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా హత్య కేసుగా మార్పు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

గోనెగండ్ల: ఎస్. లింగందిన్నె గ్రామానికి చెందిన కురువ వైష్ణవి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాలు.. కురువ వైష్ణవి, కురువ గోపాల్‌కు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. వీరు గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వైష్ణవి రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. కడుపునొప్పి భరించలేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను కిందకు దించి కోడుమూరు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. వైష్ణవి తండ్రి ఈరన్న ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.